అంటే విజయానికి మరింత దగ్గరయ్యానన్న మాట. కాబట్టి సంతోషమే. నాపై నాకు నమ్మకం వుంది. బాధపడే బదులు ఆ సమయంలో ఇంకో ఉద్యోగానికి అప్లికేషన్ పెట్టొచ్చు'' అన్నాడు చాలా అనుభవజ్ఞుడిలా.

''ఓకే. మీరిక వెళ్లొచ్చు'' అన్నారు వారు.

★ ★ ★

రెండు రోజుల తర్వాత అదే ఆఫీసు నుండి అభిమన్యుకి వెంటనే కలవమని ఉత్తరం వచ్చింది.


''సార్! మిమ్మల్ని కలవమని లెటరొచ్చింది నాకు'' అని వినయంగా ఇంతకు ముందు అతన్ని ఇంటర్వ్యూ చేసిన మేనేజరుతో అన్నాడు.

''ఎస్! కంగ్రాట్స్ అభిమన్యు! ఆఖరి నిముషంలో మిమ్మల్ని కూడా సెలెక్ట్ చేశాం. మీలో వున్న ఓర్పు, సహనం, నమ్రత, పట్టుదల ముఖ్యంగా మీ పాజిటివ్ థింకింగ్ నచ్చాయి. మీలాంటి వారుంటే కంపెనీ కూడా అభివృద్ధి చెందుతుని భావించి మీకీ ఉద్యోగం ఇస్తున్నాం. రేపే మీరు ఉద్యోగంలో చేరవచ్చు. ఆల్ ద బెస్ట్!'' అని అపాయింట్‌మెంట్ లెటర్ చేతికందించాడు మేనేజర్.

''థాంక్యూ సర్!'' షేక్‌హ్యాండ్ ఇచ్చి కదిలాడు అభిమన్యు మరింత ఆత్మవిశ్వాసంతో.

**-పల్లేర్లమూడి విజయ్ (హైదరాబాద్)**

# అసలు సంగతి



ఈ దసరా మామూళ్ళంటే నాకు తగని చిరాకు. అసలే రిటైర్ అయిన వాణ్ణి. అసలు వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తున్నందుకు మనం అప్పనంగా ఈ మామూళ్ళు ఎందుకివ్వాలి... అహ ఎందుకివ్వాలి అంటాను. అయినా నలుగురితో నారాయణా అన్నట్లు మరీ అసలు ఇవ్వకపోతే బావుండదని ఏదో యాభై ఇవ్వాల్సిన చోట పాతిక, పాతిక ఇవ్వాల్సిన చోట పది ఇలా తగ్గించి ఇచ్చి ఎలాగో నెట్టుకొస్తుంటే ఇంతలో మా శ్రీమతి నాకు గుర్తు చేసింది.. ''ఏమండోయ్ ఎవరికి ఇచ్చినా ఇవ్వకపోయినా మన పోస్ట్‌మేన్‌కి మాత్రం ఇవ్వడం ఎగ్గొట్టకండేం! పాపం అతను మీ తిరిగొచ్చిన కథలూ, నవలలూ, పత్రికవాళ్ళు పంపే పారితోషికాలూ ఠంచనుగా వచ్చి నిజాయితీగా మీకు అందజేస్తున్నాడు. అందుకే పాతిక రూపాయలకు కక్కుర్తి పడకండి... నన్నడిగితే అతనికి యాభై ఇచ్చినా తక్కువే. కానీ ఏం చేస్తాం మన ఆర్థిక పరిస్థితులు అలా వున్నాయి. అందుకే పాతికతో సరి పెట్టమంటున్నాను'' అని హెచ్చరించింది.

ఇంతలో పోస్ట్‌మేన్ రానే వచ్చాడు ఏవో లెటర్స్ తీసుకుని. నాకివ్వవలసిన ఉత్తరాలు నాకిచ్చాక కాసేపు అక్కడే తచ్చాడి వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు. నాకు నా శ్రీమతి చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. నా మనసు కాసేపు అతనికి పండుగ మామూలు ఇద్దామా అని ఊగిసలాడింది. చివరికి నా కామీనే జయించింది. ఆ అతను అడగలేదు కదా, అడగకుండా ఇస్తే లోకువ అయిపోతాం. అయినా మనమిలా అతనిని పిలిచి మరీ సమర్పించుకోవటం ఎందుకని కిమ్మనకుండా ఊరుకుండిపోయాము. అతనూ వెళ్ళిపోయాడు.

ఒక నెల గిర్రున తిరిగింది. ఆ నెలలో నాకు రావలసిన ఎం.ఓ. కోసం ఎదురుచూస్తున్నాను. పోస్ట్ మేన్ వచ్చే సమయానికి ఇంట్లో లేకపోతే మళ్ళీ ఆ ఎం.ఓ. తెచ్చుకోవడానికి ఎక్కడికో వెళ్ళాలి. మేము ఉంటున్నది చాలా కుగ్రామం. మా పరిధిలో వున్న పోస్టాఫీసుకి వెళ్ళాలంటే ఎంతో అవస్థ పడాలి. పైగా ఆటో ఖర్చులు. అందుకే రోజూ పోస్ట్‌మేన్ వచ్చే వేళకు ఎక్కడికీ వెళ్ళకుండా చూస్తున్నాను. కానీ ఒకరోజు.. రెండ్రోజులు.. మూడు రోజులు. నాకు ఎం.ఓ. రావలసిన డేట్ దాటి పది రోజులవుతున్నా ఇంకా ఎం.ఓ. రాకపోవడం నాకు ఆశ్చర్యాన్ని కలిగజేసింది. ఎందుకయినా మంచిదని పత్రికం వాళ్ళకి ఫోనుచేసి కనుక్కున్నాను. వాళ్ళు ఎప్పుడో పంపించేశామండీ అని చెప్పారు.

ఆ మరునాడు పోస్ట్‌మేన్ కనపడ్డాడు. వెంటనే అతన్ని ''ఏమయ్యా! పదిరోజులయింది నాకు రావలసిన ఎం.ఓ. ఇంతవరకూ రాలేదు. కారణమేమిటి?'' అని దులిపేసాను.

అందుకతను- ''మొన్న తీసుకొచ్చానండీ. కానీ మీరు లేరు. మీ ఇంటికి తాళం వేసి వుంది. నన్నేం చేయమంటారు'' అన్నాడు.

అది విన్న నా మతి పోయింది. ఇంతలోనే నా మెదడు పనిచేయటం ప్రారంభించింది. అయినా తను పది రోజుల నుంచీ పోస్ట్‌మేన్ వచ్చే సమయానికి ఇంట్లోనే ఉంటున్నానే. నేను లేనంటాడేమిటి. ఇతను గానీ అబద్ధం చెప్పడం లేదుకదా.. అంతే అయివుంటుంది. కొంపదీసి నేను దసరా మామూలు ఇవ్వలేదని నామీద ఇలా చెబుతున్నాడా అని నాలో నేను కొంత మథనపడి- 'నేను ఇప్పుడు పోస్ట్ ఆఫీసుదాకా వెళ్ళి తెచ్చుకోవాలంటే ఎలాగూ అంతే అవుతుంది. ఆ ఇచ్చేది ఇతనికే ఇస్తే కడుపులో చల్ల కదలకుండా ఇతనే తెచ్చి పెడతాడు కదా' అన్న నిర్ణయానికి వచ్చాను.

వెంటనే ఆ పోస్ట్‌మేన్‌ని ఆగమని చెప్పి లోపలికి వెళ్ళి పాతిక రూపాయలు తీసుకొచ్చి అతని చేతిలో పెట్టి ''బాబ్బాబు నేను ఏదో పెద్దవాణ్ణి ఆ పోస్టాఫీసు దాకా వెళ్ళి తెచ్చుకోలేను. రేపు ఎలాగో అలా నీవే తెచ్చివ్వు'' అని బతిమాలాను.

''ఈ పని ముందే చేసి వుంటే ఇంత గొడవ వుండేది కాదు కదండీ'' అని పళ్ళికిలించాడు పోస్ట్‌మేన్.

**-మాధవపెద్ది ఉష (టోలిచౌకి)**